క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని గ్రామాల క్రీడాకారులకు ఎంపీటీసీ రేవెల్లి మమత-నాగరాజుల ఆధ్వర్యంలో 'బండెల రాజేశ్వరి'స్మారక క్రికెట్‌టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వహకులు బండెల బన్ని, ప్రవీణ్, విజయ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.10,116, రెండవ బహుమతి రూ.5,116 అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.499 చెల్లించి టీ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. టీం పేరు నమోదుకు 7780593127, 7411535405, 8121400168 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గర్భిణికి విద్యుత్ షాక్



వాజేడు: మండల పరిధిలోని కొంగాల గ్రామానికి చెందిన మొడెం లక్ష్మి అనే గర్భిణి గురువారం విద్యుత్ షాక్‌కు గురైంది. వివరాల ప్రకారం మొడెం లక్ష్మి ఇంట్లో కూలర్ పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడి పోయింది. వెంటనే వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు లక్ష్మి ఆమెలో ఉన్న పిండం ఆరోగ్యంగానే ఉన్నట్లు వెల్లడించారు.

వరికొయ్యలను కాల్చొద్దు



మల్హర్: వరికొయ్యలను కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ గురువారం తెలిపారు. వరికొయ్యలకు నిప్పు పెడితే భూసారాన్ని కొల్పోవడంతో పాటు దిగుబడి తగ్గుతుందని రైతులకు తెలిపారు. అలాగే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందన్నారు. కాల్చడం ద్వారా విపరీతమైన వేడిమితో భూసారన్ని కొల్పోవడంతో పాటు నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాలు శాతం తుగ్గుతందన్నారు. ముఖ్యంగా పంటలకు ఉపయోగ పడే సూక్ష్మ జీవులు, రైతుమిత్ర పురుగులు నశిస్తాయని తెలియజేశారు. వరికొయ్యలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుందన్నారు. దీంతో ఎకరానికి టన్ను ఎరువు తయారువుతుందని పేర్కొన్నారు. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతయాని వెల్లడించారు. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరగుతుందని వివరించారు. రసాయన ఎరవులు తగ్గించాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు.

చీటింగ్ కేసు నమోదు

కాటారం: మండలంలోని విలాసాగర్ ఇటుక బట్టి నిర్వాహకుడిపై చీటింగ్ కేసు నమోదైనట్లు ఎస్సై అభినవ్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే విలాసాగర్‌లో ఇటుక బట్టి నిర్వహిస్తున్న సంతోష్‌రావు మహారాష్ట్ర నుంచి పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌కు వెళ్తున్న బొగ్గు లారీని దారి మళ్లించి తన ఇటుక బట్టి వద్ద దింపుకున్నాడు. అక్రమంగా బొగ్గు నిల్వ చేశారనే సమాచారం మేరకు సింగరేణి అధికారులు దాడులు నిర్వహించారు. బొగ్గు నిల్వకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణపత్రాలు, రసీదులు లేకపోవడంతో సింగరేణి జూనియర్ ఇన్‌స్పెక్టర్ టి.లింగయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టగా ఇటుక బట్టి నిర్వాహకుడు చీటింగ్ చేసి బొగ్గును నిల్వ చేసినట్లు తేలింది. నిర్వాహకుడు సంతోష్‌రావుపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

దుండగులను శిక్షించాలి

పరకాల : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలో భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత ద్రోహులకు అంబేడ్కర్ దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శిక్ష తప్పదని హెచ్చరించారు. అదే విధంగా దేశ వ్యాప్తంగాఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

యూనిఫాం అందించాలి



దామెర : మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు సంబంధించిన స్కూల్ యూనిఫాంక్లాత్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల సమాఖ్యకు గురువారం అప్పగించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం ఝాన్సీ మాట్లాడుతూ.. యూనిఫాంలను విద్యార్థుల కొలతల ప్రకారం కుట్టించి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ సంధ్య, ఈఆర్పీ మాధవి, ఐకేపీ సీసీ నగేష్, అకౌంటెంట్ సుకినె రాజేశ్వరితో పాటు తదితరులు ఉన్నారు.

చివరి దశకు అనుమతులు?

- రూ.4.67 కోట్లు చెల్లించాలని అటవీ శాఖ ఉత్తర్వులు జారీ
- తాడిచర్ల-భూపాలపల్లి రహదారికి మోక్షం..



కిషన్‌రావుపల్లి-భూపాలపల్లి అటవీ ప్రాంత రహదారి

మల్హర్: ఎన్నో ఏళ్ల కలగా మిగిలినతాడిచర్ల-భూపాలపల్లి రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు చివరి దశకు చేరుకోవడంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మల్హర్ మండల కేంద్రం తాడిచర్ల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే ప్రస్తుతం కాటారం మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. పెద్దతూండ్ల మీదుగా అటవీ ప్రాంతం గుండా రహదారి నిర్మిస్తే ఎంతో సమయంతో పాటు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని ప్రజలు పేర్కొన్నారు. అంతే కాకుండా మంథని నుంచి భూపాలపల్లికి వెళ్లే వారు కూడా ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చుకోవాల్సి వస్తుంది. మంథని నుంచి భూపాలపల్లికి వెళ్లాలంటే కాటారం మీదుగా 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కానీ ఖమ్మంపల్లి-తాడిచర్ల మీదుగా కేవలం 30 కిలోమీటర్ల లోనే భూపాలపల్లికి చేరుకోవచ్చు. ఏడాది క్రితం తాడిచర్ల-ఖమ్మంపల్లి గ్రామాల మధ్య మానేరు నదిపై వంతెన అందుబాటులోకి రావడంతో దూరభారం తగ్గింది. ఇదే మార్గాన్ని పెద్దతూండ్ల మీదుగా భూపాలపల్లి వరకు అటవీ ప్రాంతం గుండా నిర్మించేందుకు పలుమార్లు చేసిన ప్రయత్నాలు నేటికి కార్యరూపం దాల్చాయి. 2017 సంవత్సరంలో ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి వరకు 20 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి అనుమతి వచ్చింది. ప్రస్తుతం 12 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. మిగతా రోడ్డు నిర్మాణం కోసం అటవీ అనుమతులు రాకపోవడంతో అక్కడికే నిర్మాణాన్ని నిలిపివేశారు.

పరిహారం చెల్లించి పనులు చేసుకోండి...

రిజర్వ్ ఫారెస్ట్ నుంచి రోడ్డు నిర్మాణానికి మోకాలడ్డిన అటవీ శాఖ ఎట్టకేలకు ఒక వరస రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. మల్హర్ మండలం పెద్దతూండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌రావుపల్లి నుంచి అటవీప్రాంతం గుండా భూపాలపల్లి వన్ ఇంక్లైన్ మైన్ వరకు ఏడు మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టవచ్చని కాగా ఆ ప్రాంతంలో తాము నష్టపోతున్న చెట్ల సంపదకు గాను రూ.4.67 కోట్ల పరిహారాన్ని చెల్లించాలని అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, పారమెంట్ ఎన్నికల్లో భాగంగా తాడిచర్ల సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన కార్నర్ మీటింగ్ సమేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. త్వరలోనే కిషన్‌రావుల్లి అటవీ ప్రాతంలో రోడ్డు నిర్మాణం చేపడుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

రోడ్డు నిర్మాణానికి కృషి



రహదారి నిర్మాణం కోసం అటవీ అధికారులు ఆర్ అండ్ బీ అధికారులకు రూ.4.67 కోట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ నోటీస్ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత వాసుల కలగా ఉన్న ఈ రహదారి నిర్మాణం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా కృషి చేస్తా.

- మల్హల్‌రావు, ఎంపీపీ, మల్హర్

'ఉపాధి' కూలీలందరికీ పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

రేగొండ: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించే విధంగా చర్య తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ జమీర్ పాషా అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఉపాధి పనులు జరుగుతున్న చోట కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధిహామీ పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసే విధంగా ప్రణాళికబద్ధంగా పని చేయాలని సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ తిరుపతి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ నరిగే తిరుపతి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్ తండా గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలు ఓపెన్ అయ్యే వరకు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.

నిరంకుశ ప్రభుత్వానికి గుణపాఠం



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

భూపాలపల్లి రూరల్: నిరంకుశ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో శ్రామిక భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బందు సాయిలు ముఖ్య అతిథిగా హాజరై ఎడిటర్ ప్రబీరు పురకాష్టకు సంబంధించిన బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. మోదీ సర్కారు ఏడు నెలలుగా ఎడిటర్ పురకాష్టను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో ఉంచిందన్నారు. ప్రబీరు అరెస్టును నిరసిస్తూ దేశవ్యాప్తంగా అనేక విధాలుగా ఆందోళన పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని అరెస్టును తప్పు పట్టి తక్షణమే పరాకాష్టను రిలీజ్ చేయాలని ఆదేశించిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల అనుసరించే నిరంకుశ ప్రభుత్వాని ఈ అంశం చెంపపెట్టన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కవులు కళాకారులు ప్రజా సంఘాలు, మేధావులు ఐక్య ఉద్యమాలు నిర్వహించి చట్టాన్ని, న్యాయాన్ని కాపాడు కోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శేఖరు, మహేందర్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): పార్టీలకు అతీతంగా మున్నూరు కాపు సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ అన్నారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్రలో భాగంగా మండలానికి గురువారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న మున్నూరు కాపు కార్పొరేషన్‌లో విధి విధానాలు రూపొందించుతున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సంఘానికి సంబంధిన అభ్యర్థులను పార్టీలకు అతీతంగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునూరు కాపు సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు, నాయకులు విస్సా నాగభూషణం, కాశేశ్వరపు హరిబాబు, జక్కుల శ్యామ్, పిల్లాల లీలా రాణి, దాసరి నారాయణరావు తదితరులు ఉన్నారు.

పుట్ట మధు జన్మదిన వేడుకలు



కాటారం: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కాటారం/మల్హర్: పెద్దపల్లి జెడ్పీచైర్మన్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు జన్మదిన వేడుకలను కాటారంలో, తాడిచర్లలో గురువారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కాటారంలో మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, నాయకులు ముక్తి తిరుపతి, పంతకాని సద్వలి, ఊర వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి చౌదరి, కిరణ్‌గౌడ్, రాజశేఖర్, సద్వలి, ఉప్పు సంతోష్, శంకర్, శ్రీశైలం, మల్హర్‌లో పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, నాయకులు తాజోద్దీన్, యాదగిరిరావు, ఆయూబ్‌ఖాన్, సమ్మయ్య, రాజేశ్వర్‌రావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు తరలిరావాలి



వేణుగోపాలస్వామి ఆలయం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈనెల 23 వరకు ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం తొళ్లక్కంతో అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రెసిడెన్షియల్ ఐటీఐ కళాశాలలో 2024-25 ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల నందు ఆడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ప్రకారం భర్తీ చేయుట కోసం నోటిఫికేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 10 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

'ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డి గెలుపే ధ్యేయం'

నర్సంపేట : బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గంలోని మేథావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, విద్యావంతులను ఆయన కోరారు. పట్టణంలో రాకేశ్‌రెడ్డితో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. సుదీర్ఘకాలం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి సాధించిన పార్టీగా బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో గుర్తింపు ఉందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్ల పాటు సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టి తెలంగాణను సమగ్ర అభివృద్ధి చేశారని తెలిపారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాలులో ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న పట్టభద్రుల ఓటర్ల సమావేశానికి పార్టీ ప్రతినిధులు, ఓటర్లు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బ్యాలెట్ పేపర్‌లోని క్రమసంఖ్యలో మూడో నంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రాకేశ్‌రెడ్డి గెలుపునకు బాటలు వేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు నామాల సత్యనారాయణ, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానానికి యువకులు ముందుకురావాలి



చెట్టుకొమ్మలను తొలగిస్తున్న యూత్ సభ్యులు

శాయంపేట : మండలంలోని స్వచ్ఛంద సంస్థ, ఇతర యువకులు శ్రమదానం చేసి గ్రామాలను సుందరీకరంగా తీర్చిదిద్దుకోవాలని పత్తిపాక అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంగర విజయ్‌ప్రకాశ్ సూచించారు. గురువారం పత్తిపాకలో ఆ సంఘం ఆధ్వర్యంలో యూత్ సభ్యులు శ్రమదానం చేశారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా చెట్లకొమ్మలను తొలగించారు. విజయ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యుత్ తీగల కింద ఉన్న చెట్టుకొమ్మలను తొలగించామని, సామాజిక స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు రఘుపతి, ప్రమోద్, మనోహర్, అంబేడ్కర్, కన్నా, చింటూ పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



కాటారం: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



మొగుళ్లపల్లిలో..

కాటారం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యురాలు డాక్టర్ మౌనిక అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి ఏడీఎస్ అనే దోమ కుట్టడం ద్వారా సంక్రమిస్తుందని ఇది చికెన్ గున్యా కంటే ప్రమాదకరమన్నారు. సరైన సమయంలో చికిత్స చేయించుకోకుంటే 50 మందిలో ఒకరు మృతి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. డెంగీ నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త, మురుగునీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు వ్యాప్తి చెంది డెంగీ వ్యాధికి దారి తీస్తాయన్నారు. ప్రజలు జాగ్రత్తలు చర్యలు పాటించి డెంగీ, సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తిరుపతిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు సమ్మయ్య, రాజు, ల్యాబ్ టెక్నీషియన్స్ పుష్పలత, సాగర్, ఏఎన్‌ఎం, ఫార్మసిస్టులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మొగులపల్లి వైద్యాధికారిని డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో డాక్టర్ సరళ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరళ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఫ్రైడే గా పాటించాలన్నారు. డెంగీ రాకుండా దోమలను నివారించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, స్టాఫ్ నర్సు కల్పన, ఏఎన్‌ఎం శ్రీలత, డీఈఓ జోష్న, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులు రహదారిపై ధాన్యం ఆరబెట్టొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర : వాహనాల రవాణా జరిగే రహదారులపై ధాన్యం, మొక్కజొన్నలను ఆరబెట్టొద్దని ఎస్సై కొంక అశోక్ రైతులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల రహదారులపై ఆరబెట్టిన మొక్కజొన్నల కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రహదారిపై పంటలను ఆరబెట్టడం వలన రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో ల్యాదెళ్ల సమీపంలో జరిగిన ప్రమాదం గురించి వివరించి రైతులకు అవగాహన కల్పించారు. రహదారులపై కాకుండా ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టుకోవాలని సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి



మృతి చెందిన దున్నపోతులు

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో గేదెలు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామంలో చోటు చోసుకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శాదం వెంకన్నకు చెందిన దున్నపోతుతో పాటు చింతకాయల కిరణ్‌కు చెందిన దన్నపోతు రెండు కలిసి బుధవారం రోజువారి లాగానే మేత మేయడానికి వెళ్లిన పశువులు సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం చూడగా గ్రామానికి చెందిన ఐలుమల్లు పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి మృతి చెంది ఉన్నాయన్నారు. వీటి విలువ సూమరు రూ.2,10,000 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చిట్యాల మండలం చల్లగరిగలో..

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన సిరిపెల్లి నరేష్‌కు చెందిన పాడి గేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం రోజు వారిలాగే పాడిగేదె గ్రామ శివారులోని బురుగుగడ్డ సమీపంలో మేతకు వెళ్లింది. దీంతో మేత మేస్తున్న క్రమంలో పంట చేలలో 11కేవీ వైర్లు కిందికి ఉండడంతో వాటికి తాకి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ తోట దగ్ధం



దగ్ధమైన తోట

రేగొండ (కొత్తపల్లిగోరి): ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆయిల్ పామ్ తోట దగ్ధమైన సంఘటన కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నిమ్మల ఉషాలు గ్రామ శివారులో ఎకరం భూమిలో ఆయిల్ పామ్ సాగు చేశాడు. కాగా పక్కనే ఉన్న ఓ రైతు అతడి చేనులో చెత్త తగలబెట్టగా మంటలు ఆయిల్ పామ్ తోటకు వ్యాపించగా తోటతో పాటు, డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనలో రూ.లక్ష యాభై వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.